క్లుప్తంగా

జాతరకు ఆర్టీసీ బస్సులు నడపాలి

మరికల్ : మండలం లింగంపల్లిలో ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న ఎల్లమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులు నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు హన్మంతు, రాములు, శేఖర్ కోరారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దచింతకుంట వెంకటాపూర్, తీలేర్, పల్లెగడ్డ, మాద్వార్, మరికల్ మీదుగా జాతరకు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలన్నారు. వేల సంఖ్యలో భక్తులు జాతరకు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎల్లమ్మ బండారోత్సవాలు

మరికల్ : ఐదేళ్లకు ఓసారి నిర్వహించనున్న ఎల్లమ్మ బండారోత్సవాలను బుధవారం మరికల్‌లో నిర్వహించనున్నట్లు కుర్వ సంఘం నాయకులు సతీష్, గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ అవరణలో నిర్వహించనున్న ఉత్సవాలను జయప్రదం చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం

కోస్గి రూరల్ : ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు ఎన్నికల కోడ్ వచ్చేంత వరకు అవకాశం ఉందని ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కోస్గి గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా జాబితాను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతయ్య, నాయకులు పాలెం ప్రశాంత్, చౌడపూరం శ్రీనివాస్, పోశప్ప, డీకే రాములు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఊరలక్ష్మమ్మ దేవాలయంలో చోరీ

ఊట్కూర్ : ఊట్కూర్‌లోని శ్రీశ్రీ ఊర లక్ష్మమ్మ దేవాలయంలో చోరీ జరిగిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మంగళవారం ఉదయం దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించేందుకు వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించారన్నారు. గుడి తాళాలు పగులగొట్టి ఐదు ఇత్తడి దీపాలు, పెద్ద దీపాలు, హుండీలోని డబ్బులు, హారతిపల్లెం తదితర వస్తువులు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. చోరీపై భరత్, వెంకట్‌నారాయణ, దొబ్బలి హన్మంతు, రమేశ్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి



ధన్వాడ : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా ఎంపికైన శివరాజుకు సన్మానం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో గెలుపొంది పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మాజీ అధ్యక్షులు మాకం సురేందర్, గోవర్దన్ గౌడ్, ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

మరికల్ : ఉమ్మడి జిల్లాతో పాటు నారాయణపేట జిల్లాకు దక్కాల్సిన కృష్ణా జలాలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు ఈనెల 6న మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు వెంకట్రాములు, సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటా దక్కకుండా పోతున్న అన్యాయంపై ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అఖిలపక్షం నాయకులు, యువకులు, ఉద్యోగులు, మేధావులు, రైతులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మద్దూరు: మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మూరు గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పెద్దవాగు నుంచి గతరాత్రి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో కొమ్మూరుకు చెందిన మారుతిగౌడ్ గ్రామంలో తీసుకొస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నట్లు స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి మారుతిగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైభవంగా తిమ్మప్ప బ్రహ్మోత్సవాలు



నైవేద్యాలు వండుతున్న మహిళలు



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మక్తల్ : మండలంలోని మాద్వార్ గ్రామంలోని గట్టు తిమ్మప్పస్వామి(లక్ష్మీవేంకటేశ్వరస్వామి) బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం గుట్ట పైనుంచి స్వామి వారిని కల్యాణం మంటపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో వేడుకలో పాల్గొన్నారు. అదే విధంగా రథోత్సవం సాయంత్రం 6గంటలకు అంగరంగ వైభవోపేతంగా జరిగింది. కొండపై నుంచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని తీసుకొచ్చి రథంపై కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య ముందుకు లాగారు. రథాన్ని పూలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మక్తల్ మార్కెట్ చైర్‌పర్సన్ రాధమ్మ, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నిలో గుండురంగస్వామి రథోత్సవం..

మక్తల్ మండలం కర్ని గ్రామానికి శివారులోని శ్రీగుండురంగ స్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తీసుకువచ్చారు.భక్తులు ఉత్సవ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సతిమణి వాకిటి లలిత స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జములమ్మ ఉత్సవాలు



ఊట్కూరులో బోనాలతో భక్తులు

ఊట్కూరు : మండలం కేంద్రంలోని వీరలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా కుర్వ కులస్తులు మంగళవారం శ్రీశ్రీ జములమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలపై జ్యోతులను, బోనాలను మోస్తూ గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో శోభాయాత్రతో జమ్ములమ్మ దేవాలయం వరకు చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో కుర్వ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ఊట్కూరు: బిజ్వార్‌లోని శ్రీశ్రీ అంభత్రయ క్షేత్రంలో మంగళవారం శ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో 7వ శివ మహాపూజ సందర్భంగా శివపార్వతుల కల్యాణం కనులపండుగగా సాగింది. శ్రీశైలశెట్టి, ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ వేడుక జరిపించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎల్లమ్మ బండారు మహోత్సవం..

ధన్వాడ : మండలంలోని ఏమ్నోనోనిపల్లి గ్రామంలో ఎల్లమ్మ బండారు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొని బండారు చల్లారు. అనంతరం శివ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీ కుర్వ యాదయ్య, కతలప్ప, నరసింహనాయుడు, శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరహరి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దామరగిద్ద : రథసప్తమి పర్వదినం సందర్భంగా మండలంలోని క్యాతన్‌పల్లి వీర భద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్ధమండల శివమాల ధారణ చేపట్టిన భక్తులకు మాదవ రెడ్డి దంపతులు ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ..

నారాయణపేట రూరల్ : పట్టణంలోని తీర్థంబావి దగ్గర గల శివాలయంలో లింగు, వెంకటప్ప స్వాముల ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది శివ స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు.



బిజ్వార్‌లో శివపార్వతుల కల్యాణ వేడుకలో పాల్గొన్న ఆదిత్య పరాశ్రీ

నాణ్యమైన భోజనం అందించాలి



పల్లెర్ల పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేష్‌గౌడ్



మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి

మద్దూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని తహసీల్దార్ మహేష్‌గౌడ్ ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. మంగళవారం మండలంలోని పల్లెర్ల పాఠశాల, మేడికుంటతండా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్వ : విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్ర భోజనం అందించాలని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యాన్ని పరిశీలించి మట్టిపెల్లలు, ఉంటే తీసి వేసి బియ్యాన్ని పరిశుభ్రంగా కడిగి వండాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

నారాయణపేట రూరల్ : వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీసాయి జూనియర్ కళాశాలలో స్త్రీ వైద్య నిపుణుల బృందం క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, కోశాధికారి డాక్టర్ గీత, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ పద్మకళ, డాక్టర్ దీపిక, డాక్టర్ సౌజన్య, డాక్టర్ అక్షిత, డాక్టర్ యామిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపేట: వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం పట్టణంలోని పాలియేటివ్ కేర్‌లో క్యాన్సర్ రోగులకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 1.9 కోట్ల మంది కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా చికిత్స విజయవంతంగా అమలు చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ బాధితులకు ఆర్థిక, మానసిక సహాయ కార్యక్రమాలు నిర్వహించి సేవా సంస్థలకు విరాళాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య గౌడ్, కోఆర్డినేటర్ వసంత పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న అమీన్‌పూర్ గ్రామస్తులు

ఊట్కూరు: మండలంలోని అమీన్‌పూర్ గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం నారాయణపేట పట్టణంలో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో స్తంభాలు పడిపోయి గ్రామంలో రోజుల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుండా 11 కేవీ లైన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంజలప్ప, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మొగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన అవసరం



దామరగిద్దలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

దామరగిద్ద : సుఖ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీకేర్ డీపీఆర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ వంటి రోగాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఆర్‌టీ థెరపీలో ఉచితంగా మందులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ అశోక్, నర్సింహా, ఏఎన్ఎం అరుణ, శోభాదేవి, యశోద, శశికళ, బాల చంద్రమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన..


నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని మాట్లాడుతూ... ఎయిడ్స్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చైతన్యం తీసుకొచ్చి సమాజాన్ని మేలుకొలిపే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెర్సి వసంత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్ల వాడకం



కొత్తపల్లి: మండల పరిధిలోని హోటళ్లు, దాబాలు పలు వ్యాపార దుకాణాల్లో విచ్చల విడిగా డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపార వర్గాలు కమర్షియల్ సిలిండర్లు వాడాలని నిబంధనలు ఉన్నా .. వాటిని ఖాతరు చేయడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టమొచ్చినట్లు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వ్యాపార యజమానులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆనంద్‌ను వివరణ కోరగా దాబాలు, హోటల్లలో కమర్షియల్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నాస్తిక మేళాను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని చార్వాకాశ్రమంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 33వ జాతీయ నాస్తిక మేళాను విజయవంతం చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ పోలప్ప కోరారు. మంగళవారం మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో నాస్తిక సమ్మేళనం కరపత్రాలు విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నాస్తిక ఉద్యమానికి బీజాలు వేస్తూ, ఉద్యమాన్ని నడిపించిన చరిత్ర చార్వాక రామకృష్ణకు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ సభ్యులు, అంబేడ్కర్ సంఘం సభ్యులు పృథ్వీరాజ్, రవికుమార్, మద్దిలేటి, వెంకటేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ

నారాయణపేట రూరల్ : రోగులకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయి చికిత్స అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ అన్నారు. మండలంలోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేటు సేవా సంస్థ ప్రతినిధి మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతిభా భారతి, ఎంపీహెచ్ఈఓ అశోక్ కుమార్, ఫార్మసిస్ట్ వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్ దశరథ్, సంస్థ నిర్వాహకులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మద్దూరుకు 10, కొత్తపల్లికి 5 ఎంపీటీసీలు



అఖిల పక్ష నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో ఎంపీటీసీల పునర్విభజనలో భాగంగా మద్దూరు మండల పరిషత్‌కు 10 ఎంపీటీసీ స్థానాలు, కొత్తపల్లి మండల పరిషత్‌కు 5 ఎంపీటీసీ స్థానాలు 2011 జనాభా లెక్కల ఆధారంగా విభజన చేసినట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం మద్దూరు మండల పరిషత్ కార్యలయంలో ఉమ్మడి మండలానికి చెందిన అఖిల పక్ష నాయకుల సమక్షంలో ఎంపీటీసీ స్థానాలకు మద్దూరు, కొత్తపల్లి ఎంపీడీఓలు కలిసి విడుదల చేశారు. మద్దూరు మున్సిపాలిటీ, ఉమ్మడి మద్దూరు మండలంలో నుంచి నూతనంగా కొత్తపల్లి మండలం ఏర్పడటంతో ఎంపీటీసీ స్థానాల పునర్విభజన గతనెల 30న నోటిఫికేషన్ విడుదల చేశారు. వివిధ పార్టీల అభ్యంతరాలు తీసుకొని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

అఖిల పక్ష నాయకుల అభ్యంతరం..

ఉమ్మడి మద్దూరు మండలంలో గతంలో 19 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం మద్దూరుకు 10, కొత్తపల్లి 5 ఎంపీటీసీ స్థానాలకు కేటాయించడం ఏంటని అఖిల పక్షం నాయకులు ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రం ప్రభుత్వం దగ్గర కుల గణన సర్వే జనాభా కూడా లెక్కలోకి వచ్చింది. దాని ఆధారంగా ఈ రెండు మండలాలకు ప్రస్తుత జనాభా ఆధారంగా ఎంపీటీసీ స్థానాలు పెంచాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ స్థానాలు కేటాయించడం సరైంది కాదని ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలోఅఖిల పక్ష నాయకులు నర్సింహ, మహేందర్‌రెడ్డి, గోపాల్, ఇబ్రహీం, విజయ్, రాజు, తిమ్మారెడ్డి, అనిల్‌నాయక్, మహిపాల్, ఆశప్ప, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ హర్షకిరణ్

కృష్ణా : పదో తరగతి విద్యార్థులు తమ లక్ష్య సాధనకు గాను ఫోన్, టీవీలాంటి మాధ్యమాలకు దూరంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ హర్ష కిరణ్ సూచించారు. మంగళవారం మండలంలోని గుడెబల్లూర్ మేరి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలా చదవాలి, ఎలా గుర్తుంచుకోవాలి, సమాజంలో ఎలా ఉండాలన్నా విషయాలపై విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్, ఉపాధ్యాయులు జకారియ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు సముచిత న్యాయం



మరికల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మరికల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు సముచిత న్యాయం దక్కిందని బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవార ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. రూ. 12 లక్షల వరకు ట్యాక్స్ లేకుండా చేయడమనేది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, శ్రీరామ్, రమేష్, తిరుపతిరెడ్డి, మహేందర్‌శెట్టి, నరేష్‌గౌడ్, రాము, మోహన్‌రెడ్డి, నిఖిల్, చెన్నయ్య పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పేదలకు పెద్దపీట

ధన్వాడ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మధ్య తరగతి, పేద ప్రజలకు పెద్దపీట వేసిందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్దన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.12లక్షల వరకు ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు చేయడంతో పాటు క్రెడిట్ పథకంలో రైతులకు రూ.5 లక్షల రుణాల పెంపు, మహిళా సంఘాలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వ్యక్తిగత రుణాలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అధికం..అనర్థమే!



రసాయన మందులను పిచికారీ చేస్తున్న రైతులు

మాగనూర్: అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో మండంలోని రైతులు రోజురోజుకూ రసాయనిక ఎరువుల వాడకాన్ని అధిక మొత్తంలో వినియోగిస్తున్నారు. దీంతో నేలలో పోషకాలు తగ్గి పంటల దిగుబడులపై ప్రభావం చూపడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండిచినా ఫలితం లేకపోవడంతో మండల రైతులు దిగాలు చెందుతున్నారు.

అధిక మొత్తంలో ఎరువుల వాడకం..

మాగనూర్ మండలంలో ఈ ఏడాది పత్తి, వరి పంటల అధిక సాగుకు రైతన్నలు శ్రీకారం చుట్టారు. ఏటా విత్తనం చేసిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు మోతాదుకు మించి రసాయనికి ఎరువులు వాడుతున్నారు. తద్వారా పంట పొలాల్లో భాస్వరం నిల్వలు పేరుకుపోతున్నాయి. సూక్ష్మ పోషకాలు తగ్గిపోతున్నాయి.

తగ్గిన దిగుబడి..

మండలంలోని ఆయా గ్రామాల్లో గత సీజన్‌లో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడకం ద్వారా పత్తి, వరి పంటల దిగుబడి తగ్గింది. పంటల సాగుకు అవసరం ఉన్న మేరకు ఎరువులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరి సాగులో పిలకలు వేసే సమయంలో ఎకరాకు డీఏపీ 50 కేజీలు, చిరు పొట్టదశలో 25 కేజీల పొటాష్, పత్తి సాగులో డీఏపీ 50 కేజీలు, పూత, కాత సమయంలో 25 కేజీల యూరియా, కాయల సమయంలో 150+15 కేజీల పొటాష్ వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మోతాదుకు మించి వాడొద్దు



మండలంలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేలలో భూసారం తగ్గి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మోతాదు మించి రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రయ ఎరువుల వైపు దృష్టి సారించాలి.
– పోలప్ప
మండల వ్యవసాయ అధికారి, మాగనూర్